సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 12 । జనవరి । 2023



చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిం చాలని మదనపల్లె ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల బాలికల జిల్లా స్థాయి పోటీలు ప్రారంభించారు. - 8లో



హెచ్చరిక బోర్డు తొలగించి అక్రమ నిర్మాణాలు

కోళ్లబైలు పంచాయతీలోని ప్రభుత్వ స్థలంలో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును అక్రమణదారులు తొలగించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.160
రెండోరకం	రూ.70	రూ.108

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 173 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	570	715
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 484 కిలోలు

న్యూస్‌రీల్

జిల్లా క్రికెట్ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

– జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం. భరత్‌రెడ్డి, రెడ్డిప్రసాద్



నూతనంగా ఎన్నికైన క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కడప స్పోర్ట్స్ : క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ ఆర్ కడప డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) నూతన కార్యవర్గం ఏర్పాటైంది. బుధవారం కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో ఎన్నికల అధికారి, మాజీ డిప్యూటీ కలెక్టర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవంగా సాగాయి. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యుల జాబితాను ఎన్నికల అధికారి సుధాకర్ రెడ్డి ప్రకటించారు. ఈ నూతన కార్యవర్గం 2023 నుంచి 2026 వరకు కొనసాగనుంది.

జిల్లా అధ్యక్షుడుగా ఎం. భరత్‌రెడ్డి

సీఏవైడీ జిల్లా అధ్యక్షుడుగా వరుసగా రెండోసారి ఎం. భరత్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయనతో పాటు ఉపాధ్యక్షుడుగా జి. నగేష్‌కు మార్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా అవ్వారు రెడ్డిప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా ఎం. సాయిపృథ్వీ తేజ్, కోశాధికారిగా ఎం. మహేంద్రారెడ్డిలను ఎన్నుకున్నారు. వీరితో పాటు కె. నిరంజన్‌కుమార్‌ను కౌన్సిలర్‌గా, కె. ఖాదర్‌బాషాను ఆడిట్ ఆఫీసర్‌గా, ఎస్. మౌనికను మహిళా ప్రతినిధిగా, సిరాజుద్దీన్ దౌలా మెన్ రెప్రజంటేటివ్‌గా ఎన్నుకున్నారు. అనంతరం ఇప్పటి వరకు సేవలందించిన పూర్వపు జిల్లా కార్యదర్శి పి. సంజయ్‌కుమార్‌రెడ్డిని అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ వీసీగా బాధ్యతలు స్వీకరణ

– ఏపీ ఉన్నత విద్యామండలిలో చార్జ్ తీసుకున్న ఆచార్య ఫజుల్ రెహమాన్



వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య ఫజుల్ రెహమాన్

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ (ఎఫ్‌ఏసీ)గా ఆచార్య ఫజుల్ రెహమాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు నగరంలోని డా. అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా పనిచేస్తున్న ఈయన్ను ఇన్‌చార్జి వీసీగా నియమిస్తూ ఉన్నత విద్య ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో బుధవారం గుంటూరులోని ఏపీ ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఆయన డా. వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ వీసీగా బాధ్యతలు స్వీకరిస్తూ సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. విశ్వవిద్యాలయ స్థితిగతులను వీసీకి వివరించారు. కార్యక్రమంలో ఏపీ ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఆచార్య వై. నజీర్‌అహ్మద్, డా. హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య బాయినేని శ్రీనివాస్, వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ సూపరింటెండెంట్ వై. పవన్‌కుమార్ రెడ్డి, అనిల్, భావన పాల్గొన్నారు.

జగనన్న తోడు.. చిరు వ్యాపారులకు అండ

- చిరువ్యాపారులకు రూ.10 వేల వడ్డీలేని రుణాలు
- జగనన్నతోడు పథకంతో చిరువ్యాపారుల ముఖాల్లో చిరునవ్వులు
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

లబ్ధిదారులకు మెగాచెక్కును అందజేస్తున్న జిల్లాకలెక్టర్, మున్సిపల్ చైర్మన్ తదితరులు



రాయచోటి అర్బన్ : జగనన్న తోడు పథకం చిరువ్యాపారులు, సంప్రదాయ వృత్తుల వారికి బాసటగా నిలుస్తోందని జిల్లాకలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. జగనన్న తోడు 6వ విడత పంపిణీలో భాగంగా బుధవారం చిరువ్యాపారులకు వడ్డీలేని రుణాలు, పథకం ద్వారా గతంలో రుణం పొంది సకాలంలో చెల్లించినవారికి వడ్డీ రీఎంబర్స్‌మెంట్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కంప్యూటర్ బటన్‌నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమచేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో వీడియోకాన్ఫరెన్స్ హాలులో జరిగిన కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఎల్‌డీఎం వెంకటేశ్వర రెడ్డితో పాటు పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న తోడు 6వ విడత జిల్లాలో మొత్తం 11,134 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున రూ.11.13 కోట్లు లబ్ధిదారుల ఖాతాలకు జమచేశామని చెప్పారు. జగనన్న తోడు పథకం కింద రుణాలు పొంది సకాలంలో చెల్లించిన 19687 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.47.19 లక్షలు వడ్డీ రీఎంబర్స్‌మెంట్ కింద జమచేశామని తెలిపారు. ప్రభుత్వం చిరువ్యాపారులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని, వ్యాపారులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే తిరిగి వడ్డీలేని రుణాలు పొందవచ్చన్నారు. వీధి వ్యాపారులకు బాసటగా నిలుస్తున్న పథకాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లబ్ధిదారులు పథకం కింద తీసుకున్న సొమ్మును కచ్చితంగా వ్యాపారాలకే వినియోగించి ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు కలెక్టర్, మున్సిపల్ చైర్మన్‌ల చేతుల మీదుగా మెగా చెక్కును అందజేశారు. అనంతరం పొదుపు సంఘాల మహిళలు తయారుచేసిన తినుబండారాలను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

జగనన్న పదికాలాల పాటు సీఎంగా ఉండాలి



మాలాంటి పేదలకు మేలుచేస్తున్న జగనన్న 10 కాలాల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగాలి. జగనన్న పథకాల లబ్ధితో మా కుటుంబం సంతోషంగా ఉంది. జగనన్న తోడు పథకం ద్వారా లభించిన రూ.10వేలతో చీరల వ్యాపారం చేస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాము.

– ఎస్.రషీదా, మాసాపేట, రాయచోటి

జగనన్నతో వడ్డీల బాధ తప్పింది



నేను ఇందిరమ్మ కాలనీలో కిరాణా షాపు నడుపుకుంటున్నాను. గతంలో వ్యాపారానికి ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు తీసుకుని సంపాదించినదంతా వడ్డీలకే చెల్లించే దానిని. జగనన్న తోడు పథకం కింద రుణం పొందడం ద్వారా వడ్డీల బాధ తప్పింది. రూ.10వేలు రుణం తీసుకుని సకాలంలో తిరిగి చెల్లించినందున నాకు వడ్డీ రాయితీ అందింది. దీంతో పెట్టుబడిని పెంచుకుని మరింత వ్యాపారం చేస్తాను. చిరువ్యాపారులను ఆర్థికంగా ఆదుకుంటున్న సీఎం జగనన్న మేలును జీవితంలో మరువలేము.

– ఖాదర్‌బీ, ఇందిరమ్మకాలనీ, రాయచోటి

రూ.10 వేలతో వ్యాపారాభివృద్ధి చేస్తా



నేను మాసాపేటలో కూరగాయల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాము. జగనన్న తోడు కింద మంజూరైన రూ.10 వేలతో నా వ్యాపారాన్ని మరింతగా అభివృద్ధి చేసుకుంటాను. సీఎం జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకం ద్వారా మా కుటుంబం ఎంతో లబ్ధి పొందింది. మాకు ఎంతో లబ్ధిని చేకూర్చిన జగనన్నే జీవితాంతం ముఖ్యమంత్రిగా ఉంటే బాగుంటుంది.

– ఎస్.బీబీజాన్, రాయచోటి.

వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



సచివాలయ సిబ్బందిని సంక్షేమ పథకాలపై ఆరా తీస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

వీరబల్లి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. బుధవారం వీరబల్లి మండలం, సోమవరం, వంగిమళ్ల గ్రామ సచివాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్టిక, ఉద్యోగుల మూమెంట్ రిజిష్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్, ఎస్‌ఎల్‌ఏ గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార చర్యలు నివేదిక తదితర రికార్డులను ఆయన పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ ఆరా తీసి ఎన్ని ఇళ్లు మంజూరు, ఎన్ని పూర్తి చేశారు, ఆర్‌ఎల్ స్టేజిలో ఉన్నవి ఆర్‌సీకి తీసుకురావాలని, ఆర్‌సీ స్టేజిలో ఉన్న ఇళ్లను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సచివాలయ పరిధిలో ఎంతమంది గర్భిణులు ఉన్నారు, ఎంతమంది రక్తహీనతతో బాధపడుతున్నారు వంటి వివరాలు ఏఎన్‌ఎంను అడిగి తెలుసుకొని గర్భిణుల్లో రక్తహీనత దూరం చేసేందుకు పోషకాహారమైన భోజనం తీసుకునేలా మరింత అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో బరువు తక్కువగా, ఎత్తు పెరగకపోవడం ఉన్న వారిని డాక్టర్ వద్ద క్రమం తప్పకుండా పరీక్ష చేయించి బరువు, ఎత్తు పెరిగే విధంగా పర్యవేక్షణ చేయాలన్నారు. సచివాలయంలో సేవలు బాగా అందిస్తున్నారా లేదా వంటి వివరాలను కలెక్టర్ గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయుష్మాన్ భారత్ కార్డులకు సంబంధించి పెండింగ్ లేకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. విధులలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రీవెన్స్ నిర్వహించాలన్నారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

గండి అంజన్న సన్నిధిలో నిత్యాన్నదానం

చక్రాయపేట : పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో ఇక నిత్యాన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు. ప్రతి నిత్యం భక్తులకు అన్న ప్రసాదం పెట్టేందుకు దేవదాయ శాఖ నిర్ణయం తీసుకుంది. వివరాల్లోకి వెళితే .. గండిలో పేరుకే నిత్యాన్న దాన పథకం అని ఇక్కడ ఒక్క శనివారం మాత్రమే అన్నదానం ఉంటుందని, మిగిలిన రోజుల్లో ఉండదనే విమర్శ బలంగా ఉండేది. అయితే నిత్యాన్నదాన పథకానికి తగిన నిధులు లేవని ఇంత కాలం అధికారులు చెబుతూ వచ్చారు. అయితే ప్రస్తుత ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ పీసుపోలు రాఘవేంద్ర ప్రసాద్ ప్రత్యేక చొరవ చూపి దాతల నుంచి నిధులను చందాల రూపంలో తెప్పించారు. అయితే ఈ విషయంపై కూడా విమర్శకులు తమ వాదనను వినిపిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆలయానికి నిత్యాన్న దాన పథకానికి దాతలనుంచి వచ్చిన మొత్తం వడ్డీ అసలు కలిపి సుమారు రూ.1,60,00,000 చేరుకున్నట్లు సమాచారం. ఈ మొత్తానికి వచ్చే వడ్డీతో ప్రతి రోజు అన్న ప్రసాదం పెట్టి విమర్శకుల నోళ్లకు తాళం వేసే దిశగా ఆలయ అధికారి అనుమతి కోరుతూ దేవదాయశాఖ కమిషనర్‌కు గత నెలలో లేఖ పంపారు. ఇందుకు స్పందించిన ఆయన శనివారం రోజు భక్తుల సంఖ్య అధికంగా ఉంటుందని వెయ్యి మందికి, వారంలో మిగిలిన ఆరు దినాల్లో రోజుకు 200 మందికి అన్న ప్రసాదం చేసి వడ్డించాలని ఆదేశాలు పంపారు. ఈ ఆదేశాలు నేడో రేపో గండికి చేరనున్నాయి. ఆలయ అధికారి ముకుందరెడ్డితో పాటు పాలక మండలి చైర్మన్ రాఘవేంద్రప్రసాద్‌లు కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని శాశ్వత అన్నదాన కార్యక్రమం ప్రారంభించేందుకు ఆహ్వానించినట్లు సమాచారం.

ప్లాన్ అప్రూవల్, కన్వర్షన్ తప్పనిసరి



లేఅవుట్లపై సమీక్ష నిర్వహిస్తున్న చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వైస్‌చైర్మన్ ఎం.ఎస్.మురళి

- డెవలప్‌మెంట్ చార్జీలు కచ్చితంగా వసూలు చేయాలి
- పీకేఎం- ఉడా ఆధ్వర్యంలో సుందరీకరణ పనులు

మదనపల్లె : పలమనేరు, కుప్పం, మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పీకేఎం-ఉడా) పరిధిలోని ప్రతి లేఅవుట్‌కు డెవలపర్స్ తప్పనిసరిగా ల్యాండ్ కన్వర్షన్, ప్లాన్ అప్రూవల్ తీసుకోవాలని చైర్మన్ ఎస్. వెంకటరెడ్డియాదవ్, వైస్‌చైర్మన్, ఆర్డీఓ.ఎం.ఎస్. మురళి తెలిపారు. అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తుల నుంచి 14శాతం డెవలప్‌మెంట్ చార్జీలు జరిమానా రూపంలో వసూలు చేస్తామన్నారు. లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసేవారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు ఉన్నాయా లేదా అని పరిశీలించుకుని తీసుకోవాలని, అక్రమ లేఅవుట్లలో కొనుగోలు చేసి ఇబ్బందులు పడవద్దన్నారు. బుధవారం స్థానిక పీకేఎం-ఉడా కార్యాలయంలో చైర్మన్ వెంకటరెడ్డియాదవ్ ఆధ్వర్యంలో చిత్తూరు, అన్నమయ్య జిల్లాల డీపీఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లేఅవుట్లలో డెవలప్‌మెంట్ చార్జీలు కచ్చితంగా వసూలుచేసి పీకేఎం-ఉడాకు చెల్లించాలన్నారు. అప్రూవల్‌కు వచ్చిన డెవలప్‌మెంట్ చార్జీలను పంచాయతీల వారీగా అభివృద్ధి పనుల నిమిత్తం తిరిగి వారికి ఇస్తామన్నారు. ఇప్పటివరకు రూ.34లక్షల33వేలు నిధులు పంచాయతీలకు చెల్లించాల్సి ఉండగా, అందులో కుప్పంలోని గుడిపల్లె మండలం రూ.13లక్షలతో ప్రథమస్థానంలో ఉందన్నారు. వీటితోపాటుగా మిగిలిన నిధులను మదనపల్లె, పుంగనూరు, కుప్పం తదితర పట్టణాల్లో సుందరీకరణ పనుల నిమిత్తం వినియోగిస్తామన్నారు. ప్లాన్ అప్రూవల్స్ త్వరితగతిన మంజూరు చేసేందుకు అన్ని అనుమతులు సులభతరం చేశామని, డెవలపర్స్ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అలాగే మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వం తక్కువ రేట్లకు ప్లాట్లను ఇచ్చేందుకు ప్రారంభించిన ఎంఐజీ లేఅవుట్లకు సంబంధించి ముదివేడు, పోతబోలు, పుంగనూరు, పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో స్థల సేకరణ పూర్తయిందన్నారు. త్వరలోనే ప్లాట్ల కేటాయింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి మధు, డీఎల్‌పీఓ జయకుమారి, టీపీఓ కుముదిని, పీకేఎం-ఉడా సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు బడి.. సంప్రదాయ సందడి



గొబ్బియ్యలో....గొబ్బియ్యలో అంటూ గొబ్బెమ్మను పూజిస్తున్న ఉపాధ్యాయినులు



ఐదడుగు, పులి అడుగు వేస్తున్న ఉపాధ్యాయులు

- గోదావరి జిల్లాలను తలపించిన ముందస్తు సంక్రాంతి వేడుక
- రాజంపేట ప్రభుత్వ హైస్కూల్‌లో పాతరోజులను గుర్తు చేసిన పెద్ద పండగ సందడి

రాజంపేట టౌన్ : సంక్రాంతి అంటే ప్రతి ఒక్కరికి గుర్తుకు వచ్చేది గోదావరి జిల్లాలు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం వరకు రాయలసీమ జిల్లాల్లో కూడా పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించేవారు. ప్రస్తుతం కాలానుగుణంగా వచ్చిన మార్పుల్లో ప్రజల అభిరుచులు కూడా మారాయి. అందువల్ల గతంతో పోల్చితే ప్రస్తుతం సంక్రాంతి సందడి కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితం అయిందనే చెప్పవచ్చు. అయితే రాజంపేట పట్టణం ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుకలు అంబరమంటడమే కాక గోదావరి జిల్లాలను తలపించాయి. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా సాంప్రదాయబద్ధంగా చేపట్టే కార్యక్రమాలతో పాటు ఆటవిడుపుకోసం చేపట్టే అన్ని ఆటలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడం విశేషం. ఉదయం నుంచి సాయంత్రం వరకు చేపట్టిన కార్యక్రమాల్లో విద్యార్థులే కాక ఉపాధ్యాయులు సైతం చిన్నపిల్లల్లా మారిపోయి సందడి చేశారు. ఉపాధ్యాయులు తప్పెట్ల దరువుకు ఐదడుగు, పులి అడుగు నృత్యాలతో మరింత జోష్ తెచ్చారు. మహిళా ఉపాధ్యాయులు గొబ్బెమ్మ పాటలతో ముందస్తు సంక్రాంతి వేడుకకు వన్నెతెచ్చారు. ఇక విద్యార్థులు చేసిన సందడి అంతా ఇంతా కాదు. తమ ఆనందానికి ఆకాశమే హద్దు అన్న విధంగా అందరిని ఉర్రూతలూగించేలా సినిమా పాటలకు డ్యాన్స్ చేశారు. తోటి విద్యార్థుల ఈలలు, కేరింతలతో ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణం దద్దరిల్లింది. హరిదాసు వేషధారణ, పగటి వేషగాళ్ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సరదాగా నిర్వహించిన కోడిపందెం అందరిలో ఉత్సాహాన్ని మరింత రెట్టింపు చేసింది. మధ్యాహ్నం సంక్రాంతి వంటలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనం చేశారు. ఉపాధ్యాయులు భోగి మంట వేసి ముందస్తు సంక్రాంతి వేడుకలు ప్రారంభించగా, విద్యార్థులు గాలిపటాలు ఎగిరేసి వేడుకను ముగించారు.

ఆ గ్రామాల్లో సంక్రాంతి లేదు!

- తరతరాలుగా వస్తున్న ఆచారం
- నేటికీ గ్రామస్తులు కొనసాగిస్తున్న వైనం
- గుర్రంకొండ మండలంలో 18 గ్రామాల ప్రత్యేకత



సంక్రాంతి పండుగ జరుపుకోని టి.పసలవాండ్లపల్లె గ్రామం (ఇన్‌సెట్) టి.పసలవాండ్లపల్లెలోని శ్రీపల్లావలమ్మతల్లి ఆలయం

గుర్రంకొండ : తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమైన పండుగల్లో సంక్రాంతి పండుగకు మొదటిస్థానం ఉంది. పంటలు బాగా పండి ధాన్యరాశులు ఇంటికి చేరుకొన్న తరువాత వచ్చే మొదటి పండుగ ఇదే కావడంతో సంక్రాంతి ప్రత్యేకతను సంతరించుకుంది. పంటలు పండించడానికి సాయపడే పశువులను భక్తితో పూజించడం ఈ పండుగలో విశేషం. ఆరుగాలం కష్టపడి పనిచేసే ప్రతిరైతూ తప్పనిసరిగా ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారు. అయితే ఇందుకు భిన్నంగా సంక్రాంతి పండుగను గుర్రంకొండ మండలంలోని 18 గ్రామాల్లో జరుపుకోరు. పాత కాలం నుంచి వస్తున్న ఈ ఆచారాన్ని నేటి ఆధునిక కాలంలోనూ కొనసాగిస్తుండటం విశేషం.

సంప్రదాయాలు..ఆచారాలకు నిలయం

మారుమూల ప్రాంతమైన టి.పసలవాండ్లపల్లె పంచాయతీలోని మొత్తం 18 గ్రామాలను సంప్రదాయాలు, ఆచారాలకు నిలయంగా చెప్పుకోవచ్చు. పురాతన ఆచారం ప్రకారం ఈ గ్రామాల్లో సంక్రాంతి పండుగను జరుపుకోవడం నిషేధం. పల్లెల్లో పశువులను సింగారించడం, మేళతాళాలతో ఊరేగించడం వంటి దృశ్యాలు ఇక్కడ కనిపించవు. గ్రామ పొలిమేర్లలో చిట్లాకుప్పల వద్దకు పశువులను తీసుకెళ్లడం, పాడిఆవుల ఆరాధ్య దైవమైన కాటమరాయుడికి పూజలు నిర్వహించడం వంటి దృశ్యాలు మచ్చుకైనా కనిపించవు. గతంలో ఇక్కడి ప్రజల పూర్వీకులు ఏర్పాటు చేసుకొన్న కట్టుబాట్లకు నేటి తరం ప్రజలు కూడా కట్టుబడి ఉండడం ఈ గ్రామాల ప్రత్యేకత.


మార్చిలో జరిగే ఉత్సవాలే వీరికి సంక్రాంతి

ప్రతి సంవత్సరం మార్చినెలలో నిర్వహించే గ్రామదేవత శ్రీ పల్లావలమ్మ జాతరే ఇక్కడి ప్రజలకు సంక్రాంతి పండుగ లాంటిది. గ్రామదేవత శ్రీ పల్లావలమ్మ ఆజ్ఞానుసారం సంక్రాంతి పండుగ జరుపకూడదంటూ పూర్వకాలంలో గ్రామపెద్దలు నిర్ణయించారు. గ్రామంలో కొన్ని పశువులను గ్రామదేవత పల్లావలమ్మ పేరుమీద వదిలేసి కొందరు వాటిని మేపుతుంటారు. ప్రతి ఏడాది మార్చి నెలలో శ్రీ పల్లావలమ్మ జాతర నిర్వహిస్తారు. ఆ రోజున అమ్మవారి పేరు మీద వదిలిన ఆవులను మాత్రమే అందంగా అలంకరించి వాటిని ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళతారు. అక్కడ వాటికి భక్తిశ్రద్ధలతో గ్రామస్తులందరూ పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అదేవారికి సంక్రాంతి పండుగ.

పాడిఆవులతో వ్యవసాయం నిషిద్ధం

పాడిఆవులపై ఎంతో ప్రేమ కలిగిన ఈ గ్రామాల్లో పాడి ఆవులతో వ్యవసాయం చేయడం మాత్రం నిషిద్ధం. సాధారణంగా రైతులు ఇప్పటికీ చాలా గ్రామాల్లో పాడి ఆవులతో వ్యవసాయం చేస్తుంటారు. అయితే ఈ 18 గ్రామాల్లో మాత్రం పాడిఆవులతో వ్యవసాయ పనులు చేయరు. గోమాతను భక్తిశ్రద్ధలతో పూజించే సంస్కృతి ఇక్కడ మాత్రమే ఉండడం విశేషం. పూర్వపు తమ పెద్దల ఆచారం ప్రకారమే ఈ సంప్రదాయాన్ని నేటికి కొనసాగిస్తున్నారు.

ఆచారాలను మరువబోం



మా పూర్వీకులు, పెద్దలు ఆచరించిన ఆచారాలను, సంప్రదాయాలను మరవబోము. మా గ్రామదేవత శ్రీపల్లావలమ్మ ఉత్సవాల రోజున అమ్మవారి ఆవులను ఆలయం వద్దకు తీసుకొని వచ్చి పూజలు నిర్వహిస్తాం. అదే మాకు సంక్రాంతి పండుగ. అంతకు మించి ఇప్పుడు ఎలాంటి ఉత్సవాలు ఇక్కడ జరగవు.

– బ్రహ్మయ్య, ఆలయపూజారి, బత్తినగారిపల్లె

పెద్దల మాటే శిరోధార్యం



పెద్దల మాటే శిరోధ్యారంగా భావించి నేటికీ వారి అడుగుజాడల్లో నడుస్తున్నాం. మా ప్రాంతంలోని 18 గ్రామాల ప్రజలు సంక్రాంతి పండుగను జరుపుకోము. మా పెద్దోళ్ల కాలం నుంచి ఈ సంప్రదాయం వస్తోంది. మా పూర్వీకులు పాటించిన సంప్రదాయాలకు, సంస్కృతికి విలువ ఇస్తాం.

– శ్రీరాములురెడ్డి, గ్రామస్తుడు, టి.పసలవాండ్లపల్లె

మార్కెట్‌లో రంగుల కళ



మార్కెట్‌లో పలు రకాల రంగు పొడులు

కడప కల్చరల్ : జిల్లాలో సంక్రాంతి సందడి మొదలైంది. ప్రత్యేకించి సంక్రాంతి పండుగకు ముగ్గుల పండుగగా పేరుంది. ధనుర్మాసం ప్రారంభమైనప్పటి నుంచి గ్రామాలు, పట్టణాల్లో ఇళ్ల ముందు కళ్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు తీర్చిదిద్దడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం సంక్రాంతి పండుగ దగ్గర పడడంతో ముగ్గులు వేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఫలితంగా మార్కెట్‌లో ముగ్గులు వేసేందుకు అవసరమైన రంగుపొడుల విక్రయాలు మొదలయ్యాయి. ముగ్గులు వేసేందుకు మహిళలు, యువతులు రంగుల ముగ్గుపొడులను ఇష్టంగా కొంటున్నారు. ముగ్గులు వేసేందుకు అవసరమైన ముగ్గుపొడి, రంగులను విక్రయించేందుకు కడప మార్కెట్‌లో దాదాపు 20కి పైగా దుకాణాలు వెలిశాయి. తెల్ల ముగ్గుపిండితోపాటు రంగులు కలిపిన ముగ్గుపిండికి కూడా డిమాండ్ ఏర్పడింది. అలాంటి ముగ్గుపిండి పావుకిలో రూ. 15 చొప్పున విక్రయిస్తున్నారు. కిలో రూ. 70లుగా విక్రయిస్తుండగా, ముగ్గుపిండి కలిపిన రంగుపొడి కిలో రూ. 60కు విక్రయిస్తున్నారు. కేవలం తెల్లని ముగ్గుపిండి కిలో రూ.20 ఉండగా, ఏడు రంగుల పెద్ద చాక్‌పీస్‌లు రూ. 20లకు విక్రయిస్తున్నారు. రంగుపొడులుగల ఐదు చిన్న ప్యాకెట్ల కవర్ రూ.20లకు, 20 చిన్నప్యాకెట్లు గల కవర్ రూ. 50లకు విక్రయిస్తున్నారు. కళ్లాపి చల్లేందుకు వినియోగించే పేడ రంగు ప్యాకెట్ రూ. 5–10లకు అమ్ముతున్నారు.

ఖర్చయినా.. ఇష్టంగా..

ఓ మోస్తరు ముగ్గువేసి రంగులు నింపాలంటే కనీసం రూ. 50 నుంచి రూ. 100 రంగు పొడులు అవసరమవుతాయి. ముందే రంగులు కలిపిన ముగ్గుపిండిని ప్రత్యేకంగా అమ్ముతున్నారు గనుక మహిళలు రంగులు కొనాల్సిన అవసరం లేకుండా పోతోంది. చాక్‌పీస్‌లతో చిన్నసైజు గీతల ముగ్గు వేయాలంటే కనీసం రూ. 20 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒక్కొక్క కట్టలో ఐదారు రకాల రంగుల చాక్‌పీసులు ఉంటాయి. ముగ్గులు వేయడం కంటే అందులో రంగులు నింపి తుది మెరుగులు దిద్దడానికే ఎక్కువ శ్రమపడాల్సి వస్తోంది. అయినా మహిళలు దీన్ని తమ ప్రతిష్టగా భావించి ఇంటిలోని ఇతర మహిళలతో కలిసి తమ ఇళ్ల ముందు రంగులతో భారీ ముగ్గులను తీరుస్తున్నారు. పండుగ కోసం రెండు, మూడురోజుల ముందు నుంచి ముగ్గులు వేయడం ప్రారంభించారు.

క్లుప్తంగా

రోడ్డుప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. పీటీఎం మండలం బూర్లపల్లెకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి అజయ్‌కుమార్(18) పరీక్ష రాసేందుకు ద్విచక్రవాహనంలో బి.కొత్తకోటకు బయలుదేరాడు. బి.కొత్తకోట మండలం జనుపువారిపల్లెకు చెందిన తండ్రీ, కొడుకులు నాగరాజ(54), చక్రధర్ (16) బైక్‌లో వస్తుండగా జనుపువారిపల్లె మలుపు వద్ద విద్యార్థి అజయ్ కుమార్ వారిని వేగంగా ఢీకొన్నాడు. ప్రమాదంలో ముగ్గురికీ తీవ్రంగా గాయాలయ్యాయి. బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. నాగరాజ, చక్రధర్‌ల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు.

నాటు తుపాకీ స్వాధీనం

మదనపల్లె : నాటు తుపాకీ స్వాధీనం చేసుకుని బుధవారం ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని కొత్తవారిపల్లె పంచాయతీ నాయునివారిపల్లెకు చెందిన శ్రీనివాసులునాయుడు వ్యవసాయదైతు. ఇతను నాటుతుపాకీతో వన్యప్రాణులు వేటాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో బుధవారం నిందితుడిని అరెస్ట్ చేసి తుపాకీ స్వాధీనం చేసుకున్నామన్నారు. విచారణలో తుపాకీకి లైసెన్స్ లేనట్లు తెలిసింది. నిందితుడిపై కేసు నమోదు చేసి తుపాకీని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

బాకీ డబ్బు అడిగినందుకు దాడి

మదనపల్లె : బాకీ డబ్బు అడిగినందుకు ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. వివేకానంద నగర్‌కు చెందిన అరుణ్‌కుమార్(47) ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఆరునెలల క్రితం వాల్మీకివీధికి చెందిన రెడ్డెప్పకు రూ.25వేలు అప్పుగా ఇచ్చారు. అతను తిరిగి ఇవ్వకపోవడంతో బకాయి చెల్లించాల్సిందిగా తరచూ అడుగుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఎన్వీఆర్ కల్యాణమండపం వద్ద మద్యం మత్తులో వచ్చిన రెడ్డెప్ప అరుణ్‌కుమార్‌పై దాడికి పాల్పడ్డాడు. అరుణ్ కుమార్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వన్‌టౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదుచేశారు.

హెచ్చరిక బోర్డు తొలగించి అక్రమ నిర్మాణాలు

బోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు


ప్రభుత్వభూమిలో రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు (ఫైల్)


రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన బోర్డును తొలగించిన దృశ్యం

మదనపల్లె : కోళ్లబైలు పంచాయతీలోని రూ.10కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంలో అక్రమనిర్మాణాలు జరిపి ప్లాట్లరూపంలో విక్రయిస్తున్నారన్న స్పందన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డును ఆక్రమణదారులు తొలగించేశారు. ఎప్పటిలాగానే ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేస్తూ ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేశారు. బోర్డును తొలగించిన విషయం రెవెన్యూ అధికారులకు, స్థానిక వీఆర్వోకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరించడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోళ్లబైలు పంచాయతీ సర్వే నంబర్.889/5, 891/1లోని 1.79 ఎకరాల భూమిని దరఖాస్తు పట్టా కింద వ్యవసాయానికి కేటాయించారు.పట్టాదారుడు భూమిని వ్యవసాయానికి వినియోగించకుండా పీఓటీ చట్టాన్ని ఉల్లంఘించి అందులో ప్లాట్లు వేసి స్థానికులకు విక్రయించాడు. ఈ విషయాన్ని కోళ్లబైలు గ్రామస్తులు స్పందనలో ఆర్డీఓకు ఫిర్యాదుచేయడంతో ఆయన ఆదేశాల మేరకు ఈనెల 9న పట్టా రద్దు చేస్తూ భూమిని స్వాధీనం చేసుకుంటున్నట్లు రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. భూమిలోకి ప్రవేశిస్తే చట్టప్రకారం శిక్షార్హులని తెలిపారు. అయితే ఇదేమీ పట్టని ఆక్రమణదారులు అధికారులు వెళ్లిన తర్వాత నిబంధనలు ఉల్లంఘించి బోర్డును తీసేసి ఎప్పటిలాగానే అక్రమనిర్మాణాలను కొనసాగిస్తున్నారు. ఈ విషయమై గ్రామస్తులు సచివాలయ వీఆర్వో శంకర, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయితే ఇప్పటివరకు అధికారుల నుంచి స్పందన లేకపోగా, పరోక్షంగా ఆక్రమణదారులకు సహకరిస్తున్నారని తెలిసిందన్నారు. పేదవాళ్లు చిన్న గుడిసె వేసుకుంటే అప్పటికప్పుడు తొలగించే రెవెన్యూ అధికారులు కోట్ల విలువచేసే ప్రభుత్వస్థలంలో అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతుంటే పట్టించుకోకపోవడమేంటని ప్రశ్నించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ గిరీషాకు ఫిర్యాదుచేయనున్నట్లు తెలిపారు. దీనిపై తహసీల్దార్ సీకే.శ్రీనివాసులు మాట్లాడుతూ.. బోర్డు తొలగించిన వ్యక్తులపై చట్టప్రకారం చర్యల్లో భాగంగా పోలీసు కేసు నమోదు చేస్తామన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా


క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె సిటీ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మదనపల్లె ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా 66వ ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ అండర్ -14,17 బాల,బాలికల జిల్లా స్థాయి ఎంపికలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలకు ఉజ్వల భవిష్యత్తు ఉందని తెలిపారు. ఎంతో మంది క్రీడాకారులు జిల్లాకు మంచి పేరు, ప్రఖ్యాతులు తెచ్చారని గుర్తు చేశారు. క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌లు ఏర్పాటు చేసి క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వసీం, రహీం, శ్రీనివాసులు, డీఎస్‌డీఓ షేక్‌షఫీ, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి వసంత, రామా,హెచ్ఎం రెడ్డన్నశెట్టి, పీడీలు అన్సర్, సుధాకర్, రాంబాబు, దేవకమ్మ, సంగీత తదితరులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులకు 100, 200, 400, 600, 800,1500 మీటర్ల రన్నింగ్ రేస్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీల్లో పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు శ్రీకాకుళంలో ఈనెల 20,21న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ వసంత తెలిపారు.

త్రేతేశ్వరుని టెంకాయల వేలంలో రసాభాస

రికార్డులు చూపించాలంటూ ఈఓ నిలదీత

రాజంపేట రూరల్ : అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత శ్రీత్రేతేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రికి సంబంధించి నిర్వహించిన వేలం పాట రసాభసాగా మారింది.బుధవారం నిర్వహించిన టెంకాయల వేలంపాటకు ఈఓ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ శివయ్య, అటెండర్ హరినాథ్ వచ్చారు. వేలంపాటకు వచ్చిన ఈఓను స్థానిక గ్రామ ప్రజలు గతంలో నిర్వహించిన శివరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చిన పద్దులను చూపి టెంకాయల వేలం నిర్వహించాలని కోరారు. అటెండర్ సుధీష్‌రెడ్డి అనారోగ్యం కారణంగా రాలేక పోయారని ఈఓ తెలియజేశారు. దేవస్థానానానికి భక్తులు అందజేసిన బంగారు, వెండిని చూపించాలని పట్టు బట్టారు.దాతలు వితరణ చేసిన నగదు పద్దులను చూపాలని ఈఓను నిలదీశారు. హుండీలో వేసిన కానుకల వివరాలు వెల్లడించాలని కోరారు. అటెండర్ సుధీష్‌రెడ్డి వచ్చిన అనంతరం పద్దులు చూపి వేలం పాట నిర్వహిస్తామని ఈఓ కొండారెడ్డి తెలియజేశారు. ఈ వేలం పాటలో దేవస్థానం కమిటీ చైర్మన్ వీ వెంకటసుబ్బారెడ్డి, గ్రామ ప్రజలు కే సుబ్రమణ్యం నాయుడు, పూల బాలజీ తదితరులు పాల్గొన్నారు.

రూ. 7.31 లక్షలు విలువజేసే అక్రమ మద్యం ధ్వంసం


అక్రమ మద్యాన్ని నేలపాలు చేసి ధ్వంసం చేస్తున్న పోలీసుల

రాయచోటి : జిల్లా పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో పట్టుబడిన రూ. 7.31 లక్షల విలువజేసే అక్రమ మద్యాన్ని ధ్వంసం చేశారు. బుధవారం రాయచోటి పట్టణ సమీపంలో అడిషనల్ ఎస్పీ డాక్టర్ వివి రాజ్ కమల్, ఎక్సైజ్ ఇన్‌చార్జ్ ఎం రాధాకృష్ణల సమక్షంలో మద్యాన్ని జేసీబీతో తొక్కించారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో 86 కేసుల్లో సీజ్ చేసిన రూ. 7,31,830 విలువజేసే 6047 మద్యం ప్యాకెట్లను, 540 లీటర్ల నాటుసారా ధ్వంసం చేసిన వాటిలో ఉన్నాయని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

ఐటీఐ అప్రెంటీస్ అభ్యర్థుల జాబితా విడుదల

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ఆర్‌టీసీలో అప్రెంటీస్ శిక్షణ పొందేందుకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసినట్లు ఆర్టీసీ కర్నూలు జోనల్ శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ కె.రవి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జాబితాలో ఉమ్మడి జిల్లాలో 91 మందికి అవకాశం కల్పించారన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఈనెల 18వ తేదీ ఉదయం 9గంటలకు కర్నూలు లోని ఆర్టీసీ జోనల్ కళాశాల హాజరుకావాలని ఆయన కోరారు. తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, 4 పాస్‌పోర్టుసైజు ఫోటోలు, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఒరిజినల్ సర్టిఫికెట్ తోపాటు నాలుగు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకు రావాలన్నారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

కేవీపల్లె : మండలంలోని కేవీపల్లె పంచాయతీ దిండువారిపల్లెకు చెందిన శె. భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. శె. భాస్కర్ ఇంటినిర్మాణం చేపడుతుండగా రాములవారిపల్లెకు చెందిన రెడ్డెప్పరెడ్డి, మహేష్‌రెడ్డి, రాజారెడ్డి పనులు అడ్డుకోవడంతోపాటు కులంపేరుతో దూషించినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



బీటీ కళాశాలలో ఆర్డీఓ విచారణ


బీటీ ప్రభుత్వ కళాశాలలో విచారణ జరుపుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : పట్టణంలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆర్డీఓ ఎం.ఎస్.మురళి జిల్లా కలెక్టర్ గిరీషా ఆదేశాల మేరకు పార్ట్‌టైమ్ ఉద్యోగుల ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. కళాశాలలో దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తున్న తమకు ప్రస్తుతం జీతాలు ఇవ్వకపోగా, కళాశాలను ప్రభుత్వపరం చేసే సమయంలో ఉద్దేశపూర్వకంగా తమ పేర్లను తొలగించారంటూ కొందరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు వచ్చిన ఆర్డీఓ కళాశాలలో అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుచేసిన ఉద్యోగులతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కళాశాలకు చెందిన ఉద్యోగులు కొందరు తమకు కావాలనే జీతాలు నిలిపివేసి, ఉద్యోగ భద్రత లేకుండా చేశారని ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పటికే ప్రభుత్వ ఆధ్వర్యంలో త్రీమెన్ కమిటీ విచారణ చేసిందన్నారు. దానికి సంబంధించిన నివేదికపై ప్రభుత్వం నుంచి చర్యలు ఆలస్యమవుతుండటంతో బాధితులు జిల్లా కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల్లో జరిగిన స్పందనలో ఫిర్యాదు చేశారన్నారు. ఉద్యోగులు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చేంత వరకు వేచిచూడాలన్నారు.

ప్రయాణికుల రద్దీ కారణంగా ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సంక్రాంతిని పురస్కరించుకుని హైదరాబాదు-తిరుపతి-హైదరాబాదు (07083/07084) మధ్య ప్రత్యేక రైలును నడపనున్నట్లు కడప స్టేషన్ మేనేజర్ డీఎస్ రెడ్డి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాష తెలిపారు. 12వ తేదీ సాయంత్రం 6.10 గంటలకు హైదరాబాదులో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.40 గంటలకు తిరుపతికి చేరుతుందన్నారు.

అధ్యాపక సంఘం అధ్యక్షుడిగా నాగసురేష్


నాగ సురేష్


రఘురామయ్య


రమణయ్య

రాయచోటిటౌన్ : అన్నమయ్య జిల్లా అధ్యాపకుల సంఘం ఎన్నికలు బుధవారం రాయచోటి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఇందులో అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా నాగసురేష్ (మహల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల), ఉపాధ్యక్షుడిగా రఘురామయ్య (వీరబల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల), జనరల్ సెక్రటరీగా ఎం. రమణయ్య (పీలేరు ప్రభుత్వ బాలికల కళాశాల), ట్రెజరర్‌గా నాగేశ్వరావు (రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల), జాయింట్ సెక్రటరీగా వెంకటేష్ (బి. కొత్తకోట ప్రభుత్వ కళాశాల), రాష్ట్ర కౌన్సిలర్‌గా షకీల్ బేగం (నందలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల) మహిళ సెక్రటరీగా నీరజలక్ష్మి (రాజంపేట జూనియర్ కళాశాల)లు ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ప్రసిడెంట్ రాధకృష్ణ, కడప జిల్లా ప్రసిడెంట్ రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ఏకోనారాయణ, గుర్రంకొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అమరేంద్రకుమార్, రాయచోటి బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శంకరయ్య, విశ్రాంత అధ్యాకులు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో యుద్ధప్రాతిపదికన విద్యుదీకరణ

ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ చలపతి

మదనపల్లె : నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న వైఎస్సార్ జగనన్న కాలనీ లేఅవుట్లలో యుద్ధప్రాతిపదికన విద్యుదీకరణ పనులు పూర్తిచేసి కొత్త సర్వీసులు ఇవ్వాలని ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ చలపతి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ఏపీఎస్పీడీసీఎల్ ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం జరిగింది. కార్యక్రమానికి సీఈ చలపతి, ఎస్ఈ కృష్ణారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ..డిసెంబర్ 31, 2022 నాటికి డిపాజిట్ చెల్లించిన ప్రతి రైతుకు జనవరి 31, 2023లోపు వ్యవసాయ సర్వీస్ ఇవ్వాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విద్యుత్‌శాఖకు సంబంధించి వచ్చిన ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్స్ కాలిపోకుండా చూడాలని, ముందుగానే మరమ్మతులు చేయాలన్నారు. సంస్థకు రావాల్సిన బకాయిలను తక్షణమే వసూలుచేయాలని, చెల్లించని సర్వీసులకు విద్యుత్ నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ రాజశేఖర్ రెడ్డి, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గ ఏఈలు పాల్గొన్నారు.



కోడిపందెం రాయుళ్ల అరెస్టు

పంజేపల్లె : మండల పరిధిలోని మోటకట్ల సమీపంలో కోడిపందెం ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎస్ఎండీ షరీఫ్ తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5,200 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.